శృంగార వీధి

# ఫొటో



**"ఒక్కసారి ... ప్లీజ్! ఒక్కసారి చూపించు!"**
**"ఛీ! సిగ్గు లేకపోతే సరి!"**

"ప్లీజ్! నన్ను చంపకు, జస్ట్ చూస్తానంతే! ఏమీ చెయ్యను!"

"ఏమిటీ చూసేదీ? కట్టుకున్న పెళ్లాన్నడిగినట్టు అడుగుతున్నావ్!"

"పెళ్లాన్నయితే అడిగేదేముందిలే కానీ, అంత దాపరికం ఎందుకుట? ఒక్కసారి చూపిస్తే ఏం పోతుందీ?"

అతగాడు ఊరి నుంచి వచ్చి వారం రోజులైంది. అసలా ఊరికి వచ్చే ఆరేళ్లయింది. ఆరేళ్ల తరువాత మేనమామ ఇంటికి వచ్చిన అతగాడికి వసంతపు గాలి కొట్టి కళ్లు చెదిరిపోయాయి. అలా చెదిరిపోయిన కళ్లలో కలలు పడటం మొదలైపోయింది. ఆరేళ్ల కిందట సన్నగా పెన్సిల్లా ఉన్న అమ్మాయి ఇప్పుడు పూల తోటలా ఉంది. అప్పట్లో వెంటపడిన ఆ పదిహేనేళ్ల పిల్ల మీద చిరాకుపడ్డాడు, తప్పించుకు తిరగడానికి నానా తంటాలూ పడ్డాడు! 'ఇదెక్కడి జీడిరా బాబూ!' అనుకున్నాడు.

ఇప్పుడు ఆరేళ్ల తరువాత ఆ పిల్లే! ఏదో తెలియని కలవరం పుట్టిస్తోంది. మనసుని పట్టుజెండాలా రెపరెపలాడించేస్తోంది. పగటిపూట స్నేహితులతో కబుర్లు చెబుతున్నా తన మనసంతా ఆమె గది గుమ్మానికి కర్టెన్లా వేలాడిపోతోంది. ఆ కర్టెన్‌కే కళ్లుంటే అనిపించేసి గాస్ స్టవ్ మీద కూచున్నట్టయిపోతోంది.

కానీ ...

ఆ పిల్లకి ఇదేమీ పట్టదే! అసలు తనంత మొగాడు ఒకడు ఇంట్లో ఉన్నాడనే స్పృహ కూడా ఉన్నట్టు లేదు. ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా పలకరించాలనుకున్నా తప్పించుకుపోతోంది. ఇంట్లో ఉన్న పుస్తకాలన్నీ బీరువాలో ఆమె గదిలోనే ఉన్నాయి. పనిగట్టుకుని పదిసార్లు ఆ గదిలోకి వెళ్లి పుస్తకాలు వెతుక్కుంటున్నాడు. మధ్యాహ్నం అత్తా మామ కునుకు తీసేటప్పుడు మెల్లిగా ఆ గదిలోకి వెళ్లి 'పుస్తకాలేమన్నా ఇస్తావా?' అంటాడు. అప్పటిదాకా చదువుతున్న పుస్తకాన్ని ఖంగారుగా మూసేసి పరుపు కిందకి తోసేసి బీరువా వైపు చూపిస్తుంది తప్ప పన్నెత్తి పలకదు, కన్నెత్తి చూడదు. ఎలా? ఈ పిల్లని పలకరించటం? తన మనసులోని మాట చెప్పటం? అని తను సతమతమవుతుంటే ఆమె దాచేస్తున్న పుస్తకం ఏమిటో? దానికంత ఖంగారు ఎందుకో, అసలు అర్థం కావటంలేదు. చివరికి ఆ పుస్తకం ఒక పజిల్ అయిపోయిందతగాడికి.

నిన్న అలాగే ఖంగారుగా పుస్తకం మూసేస్తుంటే ఒక ఫొటో జారి పడింది దానిలోంచి. ఆ పిల్ల ఠక్కున దాన్ని తీసుకుని గదిలోనుంచి పారిపోయింది పుస్తకంలో దాచుకుంటూ! ఖచ్చితంగా ఎవడో పోటీ పడుతున్నాడు తనతో.

---

**అప్రయత్నంగా అతడి చేయి ఆమె నడుము మీద పడింది. నులి వెచ్చని మబ్బు మడతల్లో చేయి పడినట్లయింది. సెలయేటి అలల మడతలో చేయి పడినట్లయింది. ఆమె వెచ్చని ఊపిరి అతడి ముఖానికి ఆవిరి పట్టింది.**



ఆమె గుండెల్లో పీట వేసుక్కూచున్నాడెవడో! ఎవడు వాడు? అజ్ఞానంతో పెన్సిల్ ముక్క పూలతోటైపోతుందని తెలియని రోజుల్లో తను నిర్లక్ష్యం చేసినందుకు వాడెవడో ఎడ్వాంటేజ్ కొట్టేస్తున్నాడు. తేల్చుకోవాలి ఎలాగైనా! ఆ ఫొటో ఎవడిదో కనిపెట్టాలి. ఊహుఁ! రోజంతా గడిచిపోయింది కానీ అతడి వల్ల కాలేదు.

చివరికి ఆ పిల్లనే అడిగేశాడు -

"ఒక్కసారి ... ప్లీజ్! ఒక్కసారి చూపించు!"

బతిమాలినకొద్దీ బిగిసిపోయింది పిల్ల! కానీ ఏదో మూల ఆ బిగింపులో చిలిపితనం, కవ్వింత తొంగి చూస్తున్నట్లనిపించింది. గుడికి వెళ్లిన అత్తా మామ రాకముందే తేల్చుకోవాలి. పుస్తకం ఆమె చేతుల్లోనే ఉంది. చేతులు రెండూ వెనక పెట్టుకుని మాట్లాడుతోందేమో పూలతోట ఒళ్లు విరుచుకుంటున్నట్లుంది! ఆమె నలా చూస్తుంటే ఎక్కడ లేని తెగింపూ వచ్చింది.

"చూపిస్తావా, లేదా?"

"నీకు చూపించాల్సిన అవసరం లేదు నాకు.'

ఒక్కసారి ముందుకు వచ్చాడతను. రెండు చేతులూ ఆమె వైపు చాచాడు. వెనక్కు దాచుకున్న ఆమె చేతులను పట్టుకోబోయాడు. ఆ అదిరిపాటుకి ఆమె చేతుల్లో పుస్తకం జారిపోయింది. గబుక్కున వంగి కింద బోర్లాపడిన ఫొటోని కుడి చేతితో తీసుకుని లేచింది. అతడు దానిని అందుకోబోయాడు. ఆమె తప్పుకోబోయింది. పూల గుత్తులు అతడి గుండెలకు హత్తుకున్నాయి. అప్రయత్నంగా అతడి చేయి ఆమె నడుము మీద పడింది. నులి వెచ్చని మబ్బు మడతల్లో చేయి పడినట్లయింది. సెలయేటి అలల మడతలో చేయి పడినట్లయింది. ఆమె వెచ్చని ఊపిరి అతడి ముఖానికి ఆవిరి పట్టింది. ఫొటో విషయం అతగాడి మనసులో లేదు. తన చేతుల్లో ఉన్న పూల తోటనే చూస్తున్నాడతను. ఆమె పెదవుల మీద కనీకనిపించని చిరునవ్వు - 'ఓడిపోయావ్' అన్నట్లు.

మరో నెలా పదిహేనురోజులకు వాళ్ల పెళ్లి!

ఆ రాత్రి చందనపు వానల్లో తడిసి తడిసి సేద తీరుతున్నవేళ చటుక్కున గుర్తుకి వచ్చింది అతగాడికి ఆ ఫొటో!

"అవునూ! ఇంతకీ ఆ ఫొటో ఎవరిదీ?'

పెదవుల మధ్య బిగించిన నవ్వుతో మంచం దిగి బీరువా తెరిచి పుస్తకం మధ్య నుంచి ఫొటో తీసి ఇచ్చింది అతడికి. అది చూడగానే ఆశ్చర్యపోయాడతగాడు. ఏమీ అర్థం కాలేదు.

"హిదేవిఁటీ?" అన్నాడు.

"అవును! అది మీ నాన్న కమ్ మా మామ ఫొటోనే! ఎలాటి మొద్దావతారాన్ని కన్నావయ్యా, బాబూ! అని రోజూ దాన్ని చూసి తిట్టుకునేదాన్ని!'